# అభాగ్యులు

[ ఆరుమిల్లి విశ్వనాథరావు ]

■

"నట్టనడసంద్రాన, నావలోయున్నాను...
నడినీటిలో ముంచుతావా? నాస్వామి...
నావనొడ్డట్టించుతావా? నాస్వామి..."

అన్నపరిస్థితుల్లో నడయాడుతోందామె జీవితం. యెప్పుడో సినిమాలో విన్నపాటను జ్ఞప్తికి తెచ్చుకుంటోంది.

ఇంతకెక్కడిస్వామి? ఆ స్వామిలేడు...అసలు లేనేలేడు...ఉన్నాడు...ఉన్నాడని ప్రచారం చేస్తున్నారు... యీ నీతివంతులు...యీ దొంగభక్తులు...తలలుబోడిపైనా తలంపులు బోడివికాని యీ దొంగసన్యాసులు..జేగురుగుడ్డలనే కవచంతో లోకం అమాయకుల్ని మోసంచేసే యీకపట యోగీశ్వరులు, ఆచరణ శూన్యులయిన యీకపట వేదాంతులు... యెక్కడున్నాడు? ఎవరికి దర్శనమిస్తున్నాడు? వాడే నిజంగాఉంటే...తన పేరుమీదుగా జరిగే యీ అన్యాయాల్ని...యీ అధర్మాల్ని...యీ అక్రమాల్ని...యెలా సహిస్తున్నాడు? యెలా ఊరుకోగలుగుతున్నాడు? లేడు...ఉన్నాడని కోతలుకోసే వీళ్ళందరికీఉంటే ఉండవచ్చు...తనవంటి అభాగ్యులకి...సంఘంపాదాలక్రింద నలిగిపోతున్న అమాయకులకి...తనవంటి మందభాగ్యులకి మాత్రంలేదు.

ఆనాడుతను నీచమయినకులవృత్తిని యేవగించుకుని నిషేధించిననాడు...తన ముసలితల్లి కఠోరంగా అన్నమాటలు—"అమ్మాయ్! పాడయిపోతావ్... ప్రేమప్రేమని ఆ భికారి...డబ్బుకు గతిలేని ఆ దరిద్రుడు, ఆనే బూటకపుమాటల్లో పడిపోతున్నావ్, కష్టాల్ని కోరితెచ్చుకుంటున్నావ్, మోజు తీరేవరకే యీప్రేమ, యీఆరాటం, ఆటుపయిన కుక్కకన్న నీచమైపోతావ్...యెందుకు చెపుతున్నానో ఆలోచించు...వెళ్ళావా నువుమళ్ళీ యీగుమ్మం యెక్కవ్. కొద్దికాలంలోనే నీపతనాన్ని...నేను...యీకళ్ళతో చూస్తాను" అని యింకా యేమేమో చదవటం. అందుకు తనుయిచ్చిన జవాబు—

"శరీరాన్నిఅమ్ముకుని...డబ్బేప్రధానంయెంచుకుంటూ...కుంటివాడయినా, గ్రుడ్డివాడయినా, కుష్టురోగయినా, డబ్బిస్తేచాలు శరీరాన్ని వారివశం చెయ్యాలి...ఛీ...యెంతనీచం? యెంతహేయం? దొంగప్రేమని నటిస్తూ ప్రతివారిచేతా పరిహసింపబడుతూ తుచ్ఛంగాసాగించే యిటువంటి పాడుజీవితం నాకువద్దు...నే యెలా అయిపోయినా సరే...యెన్నికష్టాలు వచ్చినాసరే...యెవరు యేం అనుకున్నా... నేను లెక్కచెయ్యను. గులివింత గింజయేమో యెరగదన్నట్టు...యెదుటవారి తప్పుల్ని విమర్శించే యీలోకం తనతప్పుల్నిమాత్రం యెరుగదు.

భికారికానీ, గర్భదరిద్రుడుకానీ, కురూపికానీ ఆయనే నాలోకం, నాసర్వస్వం, నాదైవం...నా దృష్టిలో ఆయన మన్మధుడే, కుబేరునంతటి భాగ్యశాలే. ఆయనమాటల్లో అమృతం, ఆయనచూపుల్లో అమరత్వం, ఆనందం, హాయి. ఆ సహచర్యంలోనే యెవరూ యెరుగని నాసుఖం. ఆయనతోడిదే నాకు ఆదర్శజీవితం..."

ఇంకాయేమేమోఅనేసింది. కులవృత్తిలోప్రవేశపెట్టేందుకు నిర్బంధించే తల్లిని ధిక్కరించింది, బంధువుల్ని బహిష్కరించింది, తోడివారలను త్రోసేసింది (వారుకూడ నీచంగా జీవితాన్ని వృధాపరుస్తున్నారుగనుక) కట్టుబట్టల్తో ఆయన్ని అనుసరించింది. ఆయన చల్లని వీక్షణాల్లో, మృదుమధురమైన మాటల్లో, నిర్మలమైన ప్రవృత్తుల్లో యీప్రపంచాన్నే మర్చిపోగలింది. ఆయన తనయొక్క పవిత్రనిర్మలహృదయంలో తనకో దివ్యస్థానాన్ని ప్రసాదించారు. అదే తను గర్వించాల్సిన విషయం. అదే తనకి ఆదర్శపూర్వక

మైన మధుర ఆహ్వానం. వీళ్ళందరి లెక్క తనకిదేనికి? తనవారికి తనో చక్కని గుణపాఠం బోధించింది. తన కులానికే ఆదర్శాన్ని యెత్తిచూపింది. యివి తనజీవిత నాటకరంగంలో నాందిప్రస్తావనలు.

తనగురించి ఆయన ముందుగా యింట్లోంచి వెళ్ళగొట్టబడ్డారు. అన్నదమ్ముల్తో వివాదం పెట్టుకున్నారు. కావలసిన వాళ్ళందరికీ విరోధమైపొయ్యారు. నలుగురిలో తలయెత్తుకు తిరుగుతూ, సంభాషించే అవకాశం జారిపోయింది. కులాన్ని మంటగల్పాడనే కక్షకొద్దీ తండ్రి తన సంపాదనలోని చిల్లిగవ్వకూడా ముట్ట నర్హతలేకుండా వీలురాశాడు.

ఎన్ని అవస్థలోపాపం! ఆయనకి. యివన్నీ తనమూలాన్నేకదూ? తను యెంత పాపిష్టిది? ఆయన జీవితాన్ని తారుమారు చేసింది.

ఇందుకు తను విచారిస్తూ భాధపడుతూ ఉంటే—ఆయన హృదయంవిప్పి నవ్వుతూ అనేవారు—

“శశీ! నువ్వెందుకలా విచారిస్తూ భాధపడతావ్? నిజానికి నువ్వుమాత్రం మీవాళ్ళందర్నీ విడిచిపెట్టుకురాలా? చెప్పు! చెప్పుశశీ! పదవులకోసం, అధికారాలకోసం, ధనంకోసం, మెప్పుకోసం, పేరుకోసం, గొప్ప అనిపించుకోటానికి, నగ్నసత్యాన్ని మరుగుపర్చే యీ నటకులతో సంబంధం మనకివద్దు. ఆ పాపపుడబ్బు...అన్యాయాలకి పాల్పడి; తప్పుడు సాక్ష్యాలిచ్చి; దొంగనోట్లను సృష్టించి; వాళ్ళకీ వీళ్ళకీ తగూలుపెంచి మధ్యనునిలబడి నాటకమాడుతూ, బూటకపుమాటల్తో సంపాదించిన యీతుచ్ఛధనం... నేను ముట్టను. మనకివలదు. నేను కష్టించి, చెమటూడ్చి సంపాయించాలి. మనయిరువురం అనుభవించాలి, ఆనందించాలి. చెమటూడ్చి సంపాయించిన ఆ గంజిఅన్నమే మనకి పంచభక్ష్య పరమాన్నమంతటి తృప్తినిచ్చేది. అదే నేకోరేది, ఆశించేది. ఉన్ననాడు తిందాం, లేనినాడు పస్తుందాం. యింత విశాల ప్రపంచంలో, రెండుజీవులకు యింతఉపాధి దొరక్కపోతుందా?

ఏంచెప్పవ్ శశీ! నీచిరునవ్వు ముఖారవిందమే నాకష్టాల్లోని సుఖం...నీ మధురాధర భాషణాలే నన్నానంద లోకాల్లోకి తీసుకుపొయ్యేవి. నీ సాహచర్యంలోని ఉత్సాహరేఖలే నన్ను దేశానికుపయోగించేట్టు చేసేవి. మానవసేవకు పురికొల్పేవి. నువు నా భాగ్యలక్ష్మివి, ఆరాధ్యదేవతవు.

మాటిమాటికీ “చెడిపొయ్యావు రావెధవా!” అంటూతిడుతూ, తనేమో మహాబాగును గుర్తించినట్టు అర్థంలేనివ్యర్థ ప్రసంగాలుచేసే యీతండ్రినీ, యెవర్నిచూసినా, యెవరినోటవిన్నా, యెవరికంట పడినా, “నిర్భాగ్యుడు కులాన్ని కూలద్రోశాడు... సిగ్గులేకుండా...వీడట, వేశ్యల్నట, పతివ్రతలుగా చేస్తాట్ట...బయల్దేరాడు సంస్కర్త...వీడికీవూళ్ళో మంచినీళ్ళుకూడ పుట్టనివ్వకూడదు...వీడిసంస్కరణేవిటో బయటపడుతుంది.” (శ శేషం)


# సుధాచంద్రిక

అన్ని శగలను ఒక్కరోజులో పోగొట్టును. శగ. మూత్రనాళమందలి మంట, చురుకు తగ్గించును. గనేరియా క్రిములను ఎంతకాలము నుండియున్నను సంహరించి వ్యాధిని మొదలంట నివారించును,

# చంద్ర

స్త్రీల ఋతుశూల, ఋతుబద్ధము. ఎరుపు, తెలుపు కుసుమలు, రజోదోషములను పోగొట్టి, ఆరోగ్యజీవనము నిచ్చును.

చంద్ర:—గర్భాశయరోగ నివారిణి.

అన్నిచోట్ల దొరకును.

## క్షీరసముద్రం ఫార్మసీ,

రాజమండ్రి.